
విద్యుత్ వెతలు తీరేదెన్నడో!

ఓ వైపు లోవోల్టేజీ సమస్య.. మరో వైపు విద్యుత్ సరఫరాలో హెచ్చు తగ్గులతో విద్యుత్ ఉపకరణాలు దగ్ధమవుతున్నాయి. సెక్టార్–3 అగనంపూడి నిర్వాసిత కాలనీల్లో తరచూ సమస్య పునరావృతం అవుతున్నా అధికారులు చర్యలు చేపట్టకపోవడంతో ప్రజలు లబోదిబోమంటున్నారు. విద్యుత్ మీటర్లు సైతం షార్ట్ సర్క్యూట్ వల్ల కాలిపోతున్నాయి.

- వేధిస్తున్న లోవోల్టేజీ సమస్య
- విద్యుత్ సరఫరాలో హెచ్చు తగ్గులు
- దగ్ధమవుతున్న విద్యుత్ ఉపకరణాలు



అగనంపూడి ఆర్ఈసీఎస్ కార్యాలయం



కాలిపోయిన విద్యుత్ మీటర్



షార్ట్ సర్క్యూట్ వల్ల దగ్ధమైన ఫ్రిజ్‌ను చూపిస్తున్న మహిళ(ఫైల్)

అగనంపూడి: అగనంపూడిలో 21 నిర్వాసితకాలనీలు ఉన్నాయి. ప్రస్తుతం ఆ కాలనీలు విస్తరించాయి. బహుళ అంతస్తులు వెలిశాయి. వాటికి సరిపడా విద్యుత్ సరఫరా కాకపోవడంతో ఏడేళ్ల కిందట మంగళపాలెం జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీ వద్ద 33కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేశారు. అయితే జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీలో 4వేల పైచిలుకు విద్యుత్ కనెక్షన్లు ఉండడంతోపాటు ఫార్మాసిటీ, ఇ.మర్రిపాలెం అవసరాలకు మంగళపాలెం సబ్‌స్టేషన్ సరిపోతుంది. శనివాడ, గల్లవానిపాలెం, పాత అగనంపూడి ప్రాంతాల్లో విస్తరించిన వందలాది బహుళ అంతస్తులు, కాలనీలకు గళ్లవానిపాలెంలో ఏర్పాటు చేసిన ఇండోర్ సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా జరుగుతోంది. అయితే అగనంపూడి సెక్టార్–1,2,3ల్లోని నిర్వాసితకాలనీల్లో సమస్యను అధికారులు పట్టించుకోవడం లేదు. నిర్వాసిత కాలనీల్లో ఎప్పటికప్పుడు లో వోల్టేజీ సమస్యతో పాటు విద్యుత్ సరఫరాలో హెచ్చు తగ్గుల వల్ల అనేక ఇళ్లలో విద్యుత్ ఉపకరణాలు దగ్ధమయ్యాయి. విద్యుత్ మీటర్లు కాలిపోతున్నాయి. మీటర్లు రీడింగ్ చూపించకపోవడంతో మీటర్లు మార్చుకోడానికి వినియోగదారుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. ఈలోగా అగనంపూడిలోని ఏఈ కార్యాలయ సిబ్బంది గడిచిన మూడు మాసాల్లో ఎక్కువ మొత్తం ఏ బిల్లు ఉంటే దాన్నే ఖరారు చేస్తూ డిమాండ్ నోటీసులు అందిస్తున్నారు.

ప్రజలపై ఆర్థిక భారం

రెండు మాసాల కిందట సత్యవతి అనే మహిళ ఇంటి మీటరు విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గుల వల్ల మీటరు కాలిపోయి రీడింగ్ చూపించలేదు. దీంతో సిబ్బంది ఏప్రిల్, మే, జూన్ మాసాల్లో వచ్చిన బిల్లులు పరిశీలించిన మే నెలలో వచ్చిన బిల్లు మొత్తం (వేసవిలో ఏసీలు, ఇతర వినియోగం ఎక్కువగా ఉంటుంది) రూ.2100 చెల్లించాలని డిమాండ్ నోటీస్ పంపారు. అయితే వాస్తవంగా ఏడాదిలో ఏ నెలలో చూసినా 500 నుంచి 700 లోపే ఆమె విద్యుత్ బిల్లు ఉంటుంది. సమస్యను పరిష్కరించాల్సింది పోయి వినియోగదారులకు ఆర్థిక భారం పెడితే ఎలా అన్ని ప్రశ్నిస్తున్నారు.

అధికారుల తప్పిదానికి మాపై భారమా!



లో వోల్టేజీ, సరఫరాలో హెచ్చుతగ్గుల సమస్యకు పరిష్కారం చూపాల్సిన అధికారులు వినియోగదారులపై భారాలు మోపుతున్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్, హై, లో వోల్టేజీ వల్ల విద్యుత్ మీటర్లు దగ్ధమైనా, విద్యుత్ ఉపకరణాలు కాలిపోయినా ఆ నష్టాన్ని పూరించాల్సిన ఆర్ఈసీఎస్ తిరిగి వినియోగదారుల నెత్తిన భారం మోపడం అన్యాయం. రెండు మాసాల కిందట హై వోల్టేజీకి మీటరు తిరగడం మానేస్తే మే నెలలో రీడింగ్ ఆధారంగా జులై నెల విద్యుత్ బిల్లు చెల్లించాలని డిమాండ్ నోటీసు పంపించి ఇబ్బందులకు గురి చేశారు. ఇది సరికాదు.

– చినబాబు, దిబ్బపాలెం

ఇండోర్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలి



అగనంపూడి నిర్వాసిత కాలనీల్లో విద్యుత్ సమస్యను పరిష్కరించడానికి స్థానికంగా ఇండోర్ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలి. కాలనీలు పెరుగుతున్నాయి. విద్యుత్ కనెక్షన్లు పెరుగుతున్నా వినియోగానికి సరిపడా విద్యుత్ సరఫరా జరగడవ లేదు. లేనిపక్షంలో గళ్లవానిపాలెంలోని సబ్‌స్టేషన్ సామర్థ్యాన్ని రెట్టింపు చేయాలి.

– బి.నళిని, సెక్టార్–3

పరారైన చీటీల నిర్వాహకుడు అరెస్ట్

అక్కిరెడ్డిపాలెం: కోట్లాది రూపాయల చీటీల సొమ్ముతో వుడాయించిన నిర్వాహకుడు మరడాన పరుశురాంను అరెస్ట్ చేసి కోర్టులో ప్రవేశపెట్టినట్టు గాజువాక సీఐ ఎ.పార్థసారథి తెలిపారు. సీఐ తెలిపిన వివరాలు.. గాజువాకలోని వాంబేకాలనీకు చెందిన పరుశురాం పలు ప్రాంతాల వారిని అధిక వడ్డీలతో ప్రలోభ పెట్టి పప్పు చీటీలు, చిన్నచిన్న చీటీలు నడిపేవాడు. ముందుగా చిన్నచిన్న చీటీలను చెల్లించడంతో నమ్మకం పెరిగింది. దీంతో పలువురు లక్షల్లో చీటీలు కట్టి మోసపోయారని తెలిపారు. కొన్ని కోట్ల రూపాయలు వసూలు చేసి చీటీల చెల్లింపు దారులకు కుచ్చుటోపి పెట్టి ఆగస్టులో పరుశరాం పరారయ్యాడు. దీంతో అతని వద్ద చీటీలు కట్టినవారు లబోదిబో అంటూ గాజువాక పోలీసులను ఆశ్రయించారు. పరుశురాంను పట్టుకోవడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి చాకచక్యంగా పట్టుకున్నారు.

కాగా చీటీల పేరుతో కుచ్చు టోపి పెట్టిన మరడాన పరుశురాం 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహ పాత్రుడు (కేబుల్ మూర్తి)కు ప్రధాన అనుచరుడిగా గుర్తింపు ఉంది. కేబుల్ మూర్తి ముఖ్య అనుచరుడు, వ్యాపార భాగస్వామిగా ఉంటూఈ చర్యలకు పాల్పడ్డాడని స్థానికులు పలువురు ఆరోపిస్తున్నారు.

తిరుమలేశునికి సహస్రనామార్చన



అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్‌లోని శ్రీ తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో శనివారం రాత్రి విశేష పూజాలు నిర్వహించారు. బాలాజీకి విశేష పుష్పాలతో సహస్రనామార్చన నిర్వహించారు.

క్లుప్తంగా

225 మందికి దంత వైద్య పరీక్షలు



దంత పరీక్షలు చేస్తున్న దంత వైద్యులు, పర్యవేక్షిస్తున్న గుడివాడ లతీష్

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు రామ్‌నగర్‌లో శనివారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. 225 మందికి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్ ఆధ్వర్యంలో గీతం డెంటల్ కాలేజ్, ఆస్పత్రి సహకారంతో శిబిరం నిర్వహించారు.

కుట్టు శిక్షణతో స్వయం ఉపాధి



కుట్టు శిక్షణను ప్రారంభిస్తున్న సిరట్ల శ్రీనివాసు

పెదగంట్యాడ: మహిళలు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు కుట్టు శిక్షణ దోహదపడుతుందని రోటరీ క్లబ్ అధ్యక్షుడు సిరట్ల శ్రీనివాసు (వాసు) అన్నారు. స్థానిక సమతానగర్‌లోని గాజువాక సమతా రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పలువురు మహిళలకు కుట్టు శిక్షణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 14 రోజుల పాటు శిక్షణ ఉంటుందని చెప్పారు. అనంతరం వీరికి ఎంబ్రాయిడరీ కుట్టు మిషన్లు పంపిణీ చేస్తామన్నారు. క్లబ్‌కు మిషన్లు అందజేసి ప్రోత్సహించిన క్లబ్ మాజీ గవర్నర్ సుబ్బారావు, ప్రస్తుత గవర్నర్ వెంకటేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో విక్టర్ రాజు, సూర్యనారాయణ, డాక్టర్ జోత్స్న, శైలజ పాల్గొన్నారు.

బస్సుల టైమింగ్ బోర్డు ఏర్పాటు



దువ్వాడ రైల్వేస్టేషన్ బస్టాప్ వద్ద ఏర్పాటు చేసిన బస్సుల రాకపోకల వివరాల పట్టిక

అగనంపూడి: దువ్వాడ రైల్వే స్టేషన్ నుంచి వివిధ ప్రాంతాలకు, అలాగే దువ్వాడ రైల్వేస్టేషన్ మీదుగా రాకపోకలు సాగించే సిటీ బస్సుల వివరాలను తెలియజేస్తూ ప్రజా రవాణా సంస్థ స్టీల్‌సిటీ డిపో యాజమాన్యం డిజిటల్ బోర్డు ఏర్పాటు చేసింది. కొత్తగా దువ్వాడ నుంచి తగరపువలస వరకు 111 రూట్‌తో సిటీ బస్సు రూట్ ప్రవేశపెట్టింది. ఉదయం 7.15 నిమిషాలకు ఉదయం ప్రారంభమయ్యే ఈ సరీవ్స్ రాత్రి 7.35 వరకూ ఉంటుంది. ఈ బస్సు రోజుకు 9సార్లు నడుస్తుంది. అలాగే దువ్వాడ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వరకు 38వై సర్వీస్ నంబర్‌తో ప్రతీ పది నిమిషాలకు ఒక సర్వీస్ నడుపుతున్నారు. దువ్వాడ రైల్వేస్టేషన్ నుంచి సింధియాకు 311 సర్వీస్, అలాగే దువ్వాడ నుంచి సింహాచలం, 55వై, దువ్వాడ నుంచి పెందుర్తికి 55పీ సర్వీస్‌లను నడుపుతున్నట్టు డిస్‌ప్లే బోర్డులో పొందుపర్చారు.

ఏడాకుల చెట్లు తొలగించాలి

అగనంపూడి: జీవీఎంసీ 85, 86, 87 వార్డుల పరిధిలోని నిర్వాసితకాలనీలతో పాటు కూర్మన్నపాలెం ప్రధాన రహదారిలో వందలాదిగా నాటిన ఏడాకులు చెట్లను వెంటనే తొలగించాలని.. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని అగనంపూడికి చెందిన ప్రజా సంఘాలు హెచ్చరించాయి. జీవీఎంసీ కమిషనర్, జిల్లా కలెక్టర్ స్పందించాలని వారు కోరారు. విశాఖలో హుద్ హుద్ తుపాను సమయంలో పచ్చదనం పెంచడం కోసం ఏపుగా పెరిగే గుణం ఉన్న వీటిని నాటారన్నారు. పూల వాసన పీల్చిన వారు ఆస్మా, ఉబ్బసం, ఊపిరి తిత్తుల వ్యాధుల బారిన పడుతున్నారని చెప్పారు.వాటిని తొలగించి కాగు, వేప, రావి చెట్లు వంటి వాటిని నాటించాలని ప్రజా సంఘాల నాయకులు కొలిపాక అప్పారావు, గుదే గజేంద్రరావు, ఎల్.వి.రమణ, బలిరెడ్డి సత్యనారాయణ తదితరులు కోరారు.

మానవహారాన్ని విజయవంతం చేయాలి



ఉక్కు అడ్మిన్ బిల్డింగ్ వద్ద ధర్నా చేస్తున్న నాయకులు



స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు వద్ద ప్రచారం చేస్తున్న అఖిల పక్ష సంఘాల నాయకులు

పెదగంట్యాడ: విశాఖ ఉక్కు ఉద్యమం తీవ్రరూపం దాల్చుతోంది. రోజుకో నిరసన, ఆందోళన కార్యక్రమాలు రాష్ట్ర వ్యాప్తం చేసేందుకు విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీలు సన్నాహాలు చేస్తున్నాయి. దీనిలో భాగంగా విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు మొగ్గు చూపుతూ కార్మికుల హక్కుల కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరిని తూర్పారబడుతూ ఆదివారం ఉదయం అగనంపూడి నుంచి గాజువాక వరకు మానవహారం నిర్వహించేందుకు పోరాట కమిటీ పిలుపునిచ్చింది. ఆదివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు కార్యక్రమం ఉంటుందని పోరాటకమిటీ నాయకులు పేర్కొన్నారు.

విశాఖ ఉక్కును సెయిల్‌లో విలీనం చేయాలని కోరుతూ విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం అగనంపూడి నుంచి పాత గాజువాక జంక్షన్ వరకూ నిర్వహించనున్న మానవహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్మిక సంఘాల నాయకులు కోరారు. ఈ మేరకు స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు వద్ద శనివారం ఉదయం విధులకు వెళ్లే సమయంలో అఖిల పక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రచారం చేశారు. మానవహారంలో ఉద్యోగులు కుటుంబాలతో పాల్గొనాలని పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయడంతో పాటు సామర్థ్యం పెంచేలా కృషి చేయాలని కోరారు. ప్లాంట్ కోసం భూములు త్యాగం చేసిన నిర్వాసితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పిట్టా రెడ్డి, మసేనురావు, పీవీ రమణమూర్తి, దొమ్మేటి అప్పారావు, బొడ్డు పైడిరాజు, నందికి తాతారావు, కురందాస్ వంశీకృష్ణ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

మానవహారాన్ని విజయవంతం చేయండి

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ కోసం ఆదివారం నిర్వహించనున్న మానవహారాన్ని విజయవంతం చేయాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు కోరారు. నాయకులు శనివారం ఉక్కు అడ్మిన్ కూడలి వద్ద ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు డి. ఆదినారాయణ, కె.ఎస్.ఎన్.రావు, నీరుకొండ రామచంద్రరావు, జె. అయోధ్యరామ్, యు. రామస్వామి, నరేష్‌కుమార్, బొడ్డు పైడిరాజు, పెంటరావు, కాంద్రేగుల శ్రీనివాసనాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ శ్రేణులు పాల్గొనాలి

అగనంపూడి: ఉక్కు ప్రైవేటీకరణకు నిరసనగా కార్మిక సంఘాల ఐక్యవేదిక గాజువాక నుంచి అగనంపూడి వరకు ఆదివారం చేపట్టనున్న మానవహారంలో వైఎస్సార్‌సీపీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధానకార్యదర్శి కోమటి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. వార్డు నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల ప్రతినిధులు ఉదయం 9గంటలకు చేరుకొని మద్దతు తెలపాలని కోరారు.

900 గ్రాముల లిక్విడ్ గంజాయి స్వాధీనం

అక్కిరెడ్డిపాలెం: భెల్ (హెచ్‌పీవీపీ) సిగ్నల్ పాయింట్ వద్ద కారులో తరలిస్తున్న 900 గ్రాముల లిక్విడ్ గంజాయిని శుక్రవారం గాజువాక పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు.. గంజాయి అక్రమంగా తరలిస్తున్నారన్న పక్కా సమాచారంతో టాస్క్ ఫోర్స్ పోలీసులు నగరంలోని సంగం, శరత్ థియేటర్ వద్ద కాపుకాశారు. ఈ సమయంలో కారులోని వ్యక్తులు టాస్క్ ఫోర్స్ వాహనాన్ని ఢీ కొట్టి కారుతో పాటు వేగంగా వెళ్లిపోయారు. టాస్క్ ఫోర్స్ పోలీసులు మరో వాహనంలో నిందితుల కారును వెంబడించారు. నిందితులు పోలీసుల నుంచి తప్పించుకుని రైల్వే స్టేషన్ మీదుగా షీలానగర్ టోల్ గేటు నుంచి భెల్ (హెచ్‌పీవీపీ) సిగ్నల్ పాయింట్ వైపు వెళ్లారు. దీంతో టాస్క్‌ఫోర్సు పోలీసులు గాజువాక, మల్కాపురంపోలీసులను అలర్ట్ చేశారు. దీంతో నిందితులు కారును భెల్ సిగ్నల్ పాయింట్ వదిలి పారిపోయారు. గాజువాక పోలీసులు కారులో 900 గ్రాముల లిక్విడ్ గంజాయిని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సీఐ పార్థసారథి తెలిపారు. కాగా కారులో ఎంతమంది ఉన్నారో దర్యాప్తు చేపడుతున్నట్లు చెప్పారు. ప్రత్యేక బృందాలు నిందితుల పట్టుకునేందుకు అన్వేషిస్తున్నట్లు తెలిపారు. నిందితులు ఉపయోగించిన కారు నంబర్ ఆధారంగా దర్యాప్తు సాగిస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా సారె ఊరేగింపు



యాదవవీధిలో సారె ఊరేగిస్తున్న భవానీ భక్తులు, ఉత్సవ కమిటీ నాయకులు

అగనంపూడి: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా 87వ వార్డు కణితి యాదవ వీధి, వడ్లపూడి నిర్వాసిత కాలనీల్లో అమ్మవారి సారెను ఊరేగించారు. పలు రకాల పిండి వంటలతో వందలాది మంది భక్తులు నిర్వాసితకాలనీ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోమటి శ్రీనివాసరావు, రమాదేవి దంపతులు, మింది రాజు, జెర్రిపోతుల ఈశ్వరరావు, దేవర తాతారావు, చట్టి రాము, చొప్పా శ్రీను పాల్గొన్నారు.

- పాత అగనంపూడి నుంచి జాతీయ రహదారి మీదుగా అమ్మవారి ఆలయం వరకు సారె ఊరేగింపు చేశారు. మహిళలు కోలాట బృందాలు ఊరేగింపులో పాల్గొన్నాయి. ఆలయ కమిటీ చైర్మన్ చిత్తా గణేష్ ఆధ్వర్యంలో కార్యక్రమం చేపట్టారు.



అగనంపూడిలో సారె ఊరేగిస్తున్న భవానీలు

నేత్రపర్వంగా శరన్నవరాత్రి మహోత్సవాలు

శరన్నవరాత్రి మహోత్సవాలు అంతటా కనుల పండువగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో మూడో రోజు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ అవతారాల్లో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మను దర్శించుకుని భక్తులు తరించారు.



ధర్మాల వీధిలో శాకంబరిగా..



గాయత్రిదేవిగామహాదుర్గ



ధైర్యలక్ష్మిగా మహాలక్ష్మి



శారదా దేవి అవతారంలో..



నడుపూరు నూకాంబిక ఆలయంలో అన్నపూర్ణ హోమం



అన్నపూర్ణగా..



బర్మాకాలనీ అన్నపూర్ణ దేవిగా..

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు పరిధి ధర్మాల వీధిలో పెంటమాంబ యువజన సేవా సంఘం సభ్యులు డి. ధర్మా, గొందేశి సంతోషరెడ్డి, బొట్ట అచ్చిబాబు, గిరి, వంశీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గాదేవి అమ్మవారు శనివారం శాకంబరీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

- జీవీఎంసీ 76వ వార్డు బర్మాకాలనీలో దుర్గమ్మ శనివారం అన్నపూర్ణ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. – నడుపూరు నూకాంబిక ఆలయంలో దేవి శరన్నవరాత్రులు సందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు బొడ్డు కృష్ణారావు ఆధ్వర్యంలో శనివారం సామూహిక కుంకమ పూజలు, హోమం నిర్వహించారు. అర్చకుడు రవి కుమార్ దుర్గాదేవిని అన్నపూర్ణగా అలంకరించారు. సాయంత్రం సత్యసాయి భజన మండలి వారిచే భజన ఏర్పాటు చేశారు.

త్రిశక్తి ఆలయంలో విశేషపూజలు

ఉక్కునగరం: మహాదుర్గ, మహాలక్ష్మి, మహాసరస్వతి అమ్మవార్లు ఒకే మండపంలోని కొలువైన ఉక్కునగరం త్రిశక్తి ఆలయంలో శరన్నవరాత్రులు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా మూడో రోజు శనివారం మహాదుర్గ అమ్మవారు ముదురు ఎరుపు వర్ణం చీరలో గాయత్రిదేవిగా, శ్రీమహాలక్ష్మి అమ్మవారు ఆకుపచ్చ వర్ణం చీరలో ధైర్యలక్ష్మిగా, శ్రీమహాసరస్వతి అమ్మవారు గులాబీ వర్ణం చీరలో శారదాదేవి అవతారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ ప్రధాన అర్చకుడు ఫణి శర్మ నేతృత్వంలో ఉదయం అమ్మవార్లకు సహస్ర హస్త కంకణార్చన (గాజులతో అర్చన) చేశారు. సాయంత్రం మహిళలచే సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అన్నపూర్ణా దేవిగా..

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 68వ వార్డు అక్కిరెడ్డిపాలెంలో శ్రీ దుర్గమాంబ, కుంచమాంబ యూత్ ఆధ్వర్యంలో శరన్నవరాత్రి మహోత్సవాల్లో భాగంగా దుర్గాదేవి శనివారం అన్నపూర్ణాదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మహిళలు, చిన్నారులు చేసిన కోలాటం ఆకట్టుకుంది.

అగనంపూడి: జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడిలోని దుర్గాలమ్మ ఆలయంలో శనివారం అమ్మవారు అన్నపూర్ణాదేవి అవతారంలో దర్శనమిచ్చారు. వందలాది మంది భక్తులు, భవానీలు అమ్మవారిని దర్శించుకున్నారు.

డిప్లమాతో విస్తృత అవకాశాలు



ప్రసంగిస్తున్న డాక్టర్ సుధాకర్ పట్నాయక్

మురళీనగర్ : డిప్లమాతో అందుబాటులో ఉన్న విస్తృత ఉద్యోగావకాశాలను వినియోగించుకోవాలని మాజీ రీజినల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ డి.సుధాకర్ పట్నాయక్ సూచించారు. కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ ఇన్‌స్టిట్యూట్ (గైస్)లో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ అధ్యక్షతన శనివారం నిర్వహించిన వార్షికోత్సవం, ఫ్రెషర్స్ డే, ఫేర్‌వెల్, అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ప్రతీ వ్యక్తి జీవితంలో ఆరోగ్యం, విద్య ప్రధానమైనవన్నారు. కాలేజీలో బాలికలు ఉద్యోగ సాధనలో ముందంజలో ఉండడం ఆదర్శనీయమన్నారు. విద్యార్థులు నైపుణ్యాలు, కమ్యూనికేషన్ స్కిల్స్ మెరుగుపరచుకోవాలని సూచించారు. విశ్రాంత ఉపాధ్యాయుడు బొబ్బిలి శ్రీరామమూర్తి మాట్లాడుతూ విద్యార్థులు సబ్జెక్టుపై పట్టు సాధించినప్పుడే ఉన్నతావకాశాలు పొందగలన్నారు. అనంతరం శ్రీరామమూర్తి మాస్టారును ప్రిన్సిపాల్ కె.వెంకటరమణ ఘనంగా సత్కరించారు. అనంతరం టి.తులసీరామ్, ఐ.చైతన్యపావని, జి.లిఖితలకు మహీంద్రా కంపెనీ ఉపకార వేతనాలు అందించారు. సీహెచ్ జయప్రకాష్‌రెడ్డి, డాక్టర్ ఎస్.ప్రశాంత కుమారి, డి.దామోదరరావు, డాక్టర్ ఎం.విజయలక్ష్మి పాల్గొన్నారు.

జీవీఎంసీ స్క్రాప్ వాహనాలపై నిర్లక్ష్యం వద్దు

ఆరిలోవ: జీవీఎంసీకి చెందిన స్క్రాప్ వాహనాలపై నిర్లక్ష్యం వహించవద్దని ఇంజినీరింగ్ అధికారులకు కార్పొరేషన్ కమిషనర్ పి.సంపత్‌కుమార్ సూచించారు. ముడసర్లోవ వద్ద జీవీఎంసీ వాహన రిపేర్ కేంద్రాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఇక్కడ జీవీఎంసీకి చెందిన పాడైన వాహనాలు, ప్రమాదానికి, మరమ్మతులకు గురైన వాహనాలను పరిశీలించారు. కుప్పలుగా పడి ఉన్న వాటిని చూసిన జీవీఎంసీ కమిషనర్ ఇంజినీరింగ్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వాహనాలను ఏళ్ల తరబడి ఎందుకు నిల్వ ఉంచాల్సి వచ్చిందని, మరమ్మతులకు గురైన వాటికి రిపేర్లు ఎందుకు చేయించలేదని ప్రశ్నించారు. వాటికి సంబంధించిన వివరాలతోపాటు ఇంటింటి నుంచి వ్యర్థాలు సేకరిస్తున్న వాహనాల వివరాలను వెంటనే నమోదు చేయాలని ఆదేశించారు. జీవీఎంసీ వాహనాలకు సంబంధించిన ఇంధన వినియోగం, ఆపరేషన్స్ అండ్ మేనేజ్‌మెంట్, ఏన్యువల్ మెయింటినెన్స్ కాంట్రాక్ట్ ఖర్చును తగ్గించేలా చర్యలు చేపట్టాలన్నారు. ప్రధాన వైద్యాధికారి, మెకానికల్ విభాగం పర్యవేక్షక ఇంజినీర్లు సంయుక్తంగా జోనల్ స్థాయిలో ప్రక్షాళన చేస్తూ జీవీఎంసీకి ఆర్థిక నష్టం కలగకుండా ప్రణాళికాయుతంగా ఖర్చును నియంత్రించాలని సూచించారు. కార్యక్రమంలో పర్యవేక్షక ఇంజినీర్ కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.